నేడు మాడ్గులలో కాంగ్రెస్ పార్టీ సమావేశం

మాడ్గుల: మాడ్గులలోని వైకేఎస్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

రేపటినుంచి వాలీబాల్ పోటీలు

మంచాల: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు మంచాల సీఐ కాశీ విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారం పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మంచాలలోని క్రీడా మైదానంలో ఈ క్రీడోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు శనివారం ఉదయం 10 గంటలకు దండేటికార్ శర్వంచ్ ఫంక్షన్ హాల్ పక్కన గల క్రీడా మైదానంలోకి రావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యకర్తలే నా బలం, బలగం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- అబ్దుల్లాపూర్‌మెట్ బూత్‌స్థాయి నేతలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: బీఆర్ఎస్ కార్యకర్తలే నా బలం, బలగమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఆయన అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన బూత్ స్థాయి సమావేశంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధే లక్ష్యంగా తాను పని చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.2930 కోట్లు ఖర్చుచేశానని తెలిపారు. 15 ఏళ్ల క్రితం ఇబ్రహీంపట్నంతో పోల్చితే నేడు ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. నిరుద్యోగ యువత కోసం ఫాక్స్‌కాన్ కంపెనీలో త్వరలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మజీద్‌పూర్, చిన్నరావిరాల గ్రామాలకు చెందిన పలువురు నాయకులు మంచిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు కన్వీనర్ లక్ష్మారెడ్డి, బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం..

మంచాల: ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మంచాల ఎంపీపీ నర్మద కోరారు. మంచాల మండల పరిధిలోని దాద్‌పల్లిలో శుక్రవారం బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి ఎంపీపీ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామ స్థాయిలో ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు తెలియపర్చాలన్నారు. ప్రజలను మరింత చైతన్య పర్చి పార్టీ గెలుపుకోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు వెంకటేశ్, ఎంపీటీసీ సభ్యురాలు అనిత, స్థానిక నాయకులు రాజేందర్, పరమేష్, లక్ష్మణ్, శంకర్, లక్పతి, రాజు, హీరానాయక్, రమేశ్, రాజు, రవిసేవా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌దే అధికారం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం: తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి జోస్యం చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కాంగ్రెస్‌ను, ఆపార్టీ చెబుతున్న ఆరు గ్యారంటీ పథకాలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 24 గంటల విద్యుత్, ఇంటింటికి మంచినీరు, ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, వృద్ధులు, వితంతువులకు, వివిధ వృత్తిదారులకు ఆసరా ఫించన్లు, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్‌కిట్ తదితర సంక్షేమ పథకాలతో ప్రజలు లబ్ధి పొందారన్నారు. తాజాగా కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మెనిఫెస్టో సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు.మరోసారి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

- ఎంపీపీ కమ్లీమోత్యానాయక్
- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

కడ్తాల్: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్ అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభ ప్రారంభం కాగానే పశువైద్యాధికారి భానునాయక్ తన శాఖకు సంబంధించి నివేదికను సభ్యులకు చదివి వినిపిస్తుండగా.. గత సభలో చేసిన తీర్మాణాలు ఎంతవరకు వచ్చాయని ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా ప్రశ్నించారు. కడ్తాల్‌కు చెందిన గొర్రెల పెంపకం దారులు డీడీలు చెల్లించి నెలలు గడుస్తున్నా రెండో విడుత గొర్రెల పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు.

అరకొర నీటి సరఫరా..

మిషన్ భగీరథ తాగునీటి పథకం ద్వారా కడ్తాల్, మైసిగండి, రావిచేడ్ గ్రామాల్లో జనాభాకు అనుగుణంగా పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరగడం లేదని ఆయా గ్రామాల ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, తులసీరాం సభ దృష్టికి తెచ్చారు. అదే విధంగా గ్రామాల్లో మిషన్‌భగీరథ నీటి సరఫరా కొరకు సీసీ రోడ్లను తవ్విన మిషన్‌భగీరథ అధికారులు తిరిగి వాటి పునరుద్ధరణ పనులను నాణ్యతగా చేపట్టలేదని వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అధికారుల పనితీరును విమర్శించారు. గ్రామంలోని 5, 6 సర్వే నంబర్లలో ఏర్పాటు చేసిన వెంచర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకుండానే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇస్తున్నారని గత సభలోనూ ఈ సమస్యను ప్రస్తావించిన, వెంచర్‌పై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని వైస్ ఎంపీపీ ఆనంద్ సభ దృష్టికి తేగా.. వెంచర్ నిర్వాహకులకు నోటీసులు అందజేశామని ఎంపీఓ మధునూధనాచారి బదులిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు సకాలంలో చెల్లించాలని, అభయహస్తం డబ్బులు అందడం లేదని కోఆప్షన్ సభ్యులు జహంగీర్‌బాబా సభ దృష్టికి తెచ్చారు. త్వరలోనే అభయ హస్తం డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యేలా చూస్తామని ఏపీఎం రాజేశ్వరి తెలిపారు. మండల పరిధిలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పూర్తిస్థాయిల్లో సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేలా చూడాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్.. ఎంపీడీఓ రామకృష్ణకు సూచించారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తమతమ శాఖల ప్రగతినివేదికలను చదివి వినిపించారు. ఎస్‌హెచ్ఓ శివప్రసాద్, ఎంఈఓ సర్దార్‌నాయక్, పీఆర్ ఏఈ పరమేశ్, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, గోపాల్, మంజుల, నిర్మలాదేవి, సర్పంచ్‌లు సేవ్యా, హరిచంద్, సుగుణ, ఏఓ శ్రీలత, ఎంపీహెచ్ఈఓ సుధీర్‌బాబు, ఏపీఓ రాజేశ్వరి, ఎక్సైజ్ ఎస్ఐ యాదయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పంటరుణాలు మాఫీ చేయాలి

పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్

మంచాల: ఎన్నికల హామీ మేరకు రైతులకు పూర్తి స్థాయిలో పంట రుణాలు మాఫీ చేయాలని పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంచాలలోని రైతువేదిక వద్ద వ్యవసాయాధికారి (ఏఈఓ) లింగస్వామికి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో అర్హులైన 3వేల మందికి పంటరుణాలు మాఫీ చేయలేదని తెలిపారు. పంట రుణాలు, పంటలు ఎండి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం కూడా అందించాలని డిమాండ్ చేశారు. చెన్నారెడ్డిగూడ ఉపసర్పంచ్ పరమేష్, రైతులు పాల్గొన్నారు.

ఇంద్రసేనారెడ్డికి సన్మానం



ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డిని అబ్దుల్లాపూర్‌మెట్ మండల బీజేపీ అధ్యక్షుడు విష్ణుగౌడ్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. మలక్‌పేట ఎమ్మెల్యేగా, బీజేపీ పటిష్టత కోసం ఆయన చేసిన కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం త్రిపుర గవర్నర్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు జంగమయ్యగౌడ్, నాయకులు పాపయ్యగౌడ్, శ్రావన్‌చారి, సాయికిరణ్, సాయికుమార్, వినోద్, ఎంసీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

- కల్వకుర్తి హస్తం అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి



కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నేతలు

ఆమనగల్లు: రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న కేసీఆర్‌ను గద్దె దింపేందుకు ప్రజలంతా కాంగ్రెస్‌తో కలిసి రావాలని ఆ పార్టీ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజాపాలన సాధ్యమని పేర్కొన్నారు. మాడ్గుల, కడ్తాల మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం ప్రజల ఆకాంక్షలను గుర్తించిన సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారన్నారు. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యకమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్‌యాదవ్, శేఖర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


‘ఆవేర్’ ఆస్తులను కాపాడుకుందాం

- ప్రజాసేవ కోసం 1975లో స్థాపన
- అక్రమంగా భూవిక్రయానికి యత్నం
- ఆవేర్ ఫైనాన్స్ కమిటీ డైరెక్టర్ హర్యానాయక్

తలకొండపల్లి: ఆవేర్ సంస్థల ఆస్తులను కాపాడుకుందామని ఆ సంస్థ ఫైనాన్స్ కమిటీ డైరెక్టర్ హర్యానాయక్ అన్నారు. నిరుపేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఆవేర్ సంస్థలను స్థాపించామని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆస్పత్రి ఎదుట విలేకరులతో మాట్లాడుతూ.. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో మండల పరిధిలోని దేవుని పడకల్‌లో 6 ఎకరాల స్థలంలో ఆవేర్ సంస్థల ఆధ్వర్యంలో 1975లో 30 పడకల ఆస్పత్రిని నిర్మించారు. ఈ ఆస్పత్రి కోసం అప్పట్లో స్థానిక నాయకుడు నరహరిరెడ్డి సహకారంతో స్థానిక నాయకుడు జక్‌పాల్‌రెడ్డి 6 ఎకరాల స్థలాన్ని ఆవేర్ ఆస్పత్రి కోసం దానం చేశారన్నారు. ఈ స్థలంలో ఆస్పత్రిని నిర్మించి నిరుపేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. అయితే ఇటీవల ఆస్పత్రి భూమిని కొందరు అక్రమార్కులు అమ్మకానికి పెట్టగా.. కొందరు వ్యక్తులు కొన్నారని ఆరోపణలున్నాయన్నారు. ఆవేర్ సంస్థ అనేది ఎన్జీఓలదని.. విదేశీ సంస్థల నుంచి వేలకోట్ల రూపాయలు విరాళంగా వచ్చాయన్నారు. ఆ డబ్బును పేదల కోసం ఉపయోగించాలని కోరారు. ఆస్పత్రి భూమి 6 ఎకరాల స్థలంపైన కోర్టు కేసు ఉందని.. ఆ భూమిని కొన్నవారికి ఎలాంటి రిజిస్ట్రేషన్ కాదని తెలిపారు. ఇది ప్రజల ఆస్థి అని.. క్రయవిక్రయాలు జరిపితే శిక్షార్హుల వుతారని తెలిపారు. కొంతమంది వ్యక్తులు ఆవేర్ సంస్థను నాశనం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అవసరమైతే ఈ భూమిని ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని ప్రజావసరాల నిమిత్తం వినియోగించాలని కోరారు. సర్పంచ్ రమేష్, ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు.. రాములు, లక్ష్మయ్యగౌడ్, మల్లమ్మ, పెంటయ్య, రవి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

‘విశ్వకర్మ’ పథకాన్ని వినియోగించుకోవాలి

- బీజేవైఎం అదనపు కార్యదర్శి పాండు



దరఖాస్తు ఫారాలు అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి నీలకంఠం పాండు అన్నారు. 18 రకాల సాంప్రదాయక చేతి వృత్తుల వారు, కళాకారులు లబ్ధి పొందనున్నారని పేర్కొన్నారు.బీజేపీ సీనియర్ నేత ఆచారి పిలుపు మేరకు పాండు ఆధ్వర్యంలో శుక్రవారం జంగారెడ్డిపల్లిలో పీఎం విశ్వకర్మ యోజన పథకానికి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ పథకం ద్వారా రూ.3లక్షల రుణంఅందనుందన్నారు. రూ.15వేల విలువైన పనిముట్లు అందజేస్తారన్నారు. నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణ అందించబడుతుందన్నారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 భృతి అందించబడుతుందన్నారు. చేతి వృత్తులవారు, కళాకారులకు చేతి నిండా పని ఉండాలని ఆర్థికంగా లబ్ధి పొందాలనే ఉద్దేశ్యంతో ప్రధాని నరేంద్రమోడీ విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు.